క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



మరికల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సరస్వతి ఆలయానికి మాజీ ఎంపీపీ శ్రీకళరాజువర్ధన్‌రెడ్డి మంగళవారం రూ. 50వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎక్కడలేని విధంగా మండలంలోని సరస్వతీ ఆలయం నిర్మించడం సంతోషకరమైన విషయమన్నారు. దాతలు ముందుకొచ్చి సహకరిస్తే ఆలయ నిర్మాణం పూర్తిచేసి త్వరలోనే ప్రారంభిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రూ. 50వేలు విరాళం ఇచ్చిన మాజీ ఎంపీపీని వారు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, జగదీష్, రాములు, కృష్ణయ్య, కొండారెడ్డి, మతిన్ పాల్గొన్నారు.

పార్టీకి తీరని లోటు..




ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో సీపీఐ ఎంఎల్ నాయకులు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. జిల్లా నాయకులు కిరణ్ మాట్లాడుతూ.. ఆయన 50ఏండ్ల పాటు విప్లవ ఉద్యమంలో ప్రజలకోసం ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నబాబు, శారధ, బాబు, కనకరాయుడు, కేశవులు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

మద్దూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని నేటికి 8నెలలు గడుస్తున్నా అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. గతంలో లక్ష రుణమాఫీ చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 19వేల కోట్లు అవసరమైతే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరువేల కోట్ల కుదించారని గుర్తుచేశారు. రైతుబంధు ఈ సీజన్‌లో రైతుల ఖాతాల్లో వేయకుండా మంత్రివర్గ సబ్ కమిటీ పేరిట కాలయాపన చేస్తున్నారే తప్పరైతుల మేలు కోసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఏ ఒక్కటి నేరవేర్చకపోగా.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పథకాలను కూడా ఎత్తేశారని గుర్తుచేశారు. సీఎం నియోకవర్గంలో కక్షసాధింపు దొరణి మానుకోవాలన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకులపై ఏలాంటి కక్షసాధింపులు లేవని గుర్తుచేశారు. మండల అధ్యక్షుడు గోపాల్, రాములు, వెంకటయ్య, శ్రీనివాస్, కృష్ణ, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

పార్లమెంట్ సందర్శనకు బీజేపీ నాయకులు



మాగనూర్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా డీకే అరుణ ఆదేశ అనుసారంగా పార్లమెంట్ సందర్శించడానికి మండల ముఖ్య బీజేపీ నాయకులు మంగళవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లినట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడారు.. రాష్ట్రంలో బీజేపీపార్టీకి ఎనిమిది పార్లమెంట్ స్థానాలను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా పాలమూరు పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ మాయమాటలు నమ్మకుండా నిజమైన సేవకురాలుకు తమ విలువైన ఓటువేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయకులు నారాయణ, కనకరాజు, జయనంద్‌రెడ్డి, తిమ్మప్ప, కృష్ణయ్య, భరత్, భీంరాజు తదితరులు వెళ్లారు.

ఊరడమ్మ బోనాలకు ఆలయం ముస్తాబు

కోస్గి: ప్రతియేటా ఆషాఢ మాసంలో నిర్వహించే గ్రామ దేవతల బోనాల వేడుకల్లో భాగంగా నేడు బుధవారం ఊరడమ్మ గ్రామ దేవత బోనాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు పట్టణ నడి బొడ్డున ఉన్న ఊరడమ్మ ఆలయాన్ని బోనాల వేడుకకోసం రంగులు వేసి ముస్తాబు చేశారు. కులాలకతీతంగా పట్టణంలోని అన్ని కాలనీల ప్రజలు సమిష్టిగా అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఈ మేరకు ఆలయాన్ని వేడుకలకు సిద్ధం చేశారు.



అయోమయం.. గందరగోళం

- రుణమాఫీ మార్గదర్శకాలతో సందేహం
- రూ. 2లక్షలకు మించి ఉన్న రుణం చెల్లిస్తేనే మాఫీ వర్తింపు
- రేషన్‌కార్డు అనుసంధానంతో పూర్తి వివరాలు
- సందేహాలు తీర్చేందుకు ఏఈఓలతో ప్రత్యేక కౌంటర్‌లు



దామరగిద్ద రైతు వేదికలో రైతులకు వివరాలు తెలియజేస్తున్న ఏఈఓ

దామరగిద్ద: రైతు రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయి. కానీ, వాటికి జవాబులే దొరకడం లేదు. దీంతో రుణమాఫీ మార్గదర్శకాలు రైతుల్లో అనేక భయాలు, గందరగోళం సృష్టిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో లక్షలోపు రుణం కలిగిన అర్హులైన 28684మంది రైతులకు రూ. 165.45 కోట్ల నిధులను విడుదల చేసింది. కాగా రుణమాఫీ అమలుపై లక్ష లోపు రుణం ఉన్నా మాఫీ లిస్టులో పేరు రాకపోవడం రేషన్ లింక్ విషయమై రైతులు తమ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పంట రుణం ఉన్న మాఫీ లిస్టులో నా పేరు రాలేదు? ఒకే రేషన్‌కార్డులో తండ్రి కొడుకులు ఇద్దరికి అప్పు ఉన్న మాఫీ అయింది. మాకేందుకు మాఫీ రాలేదు? భూమి అమ్ముకున్నాం మాకు వర్తిస్తుందా? మా రేషన్ కార్డులో ముగ్గురు పేరున లక్షలోపే రుణం ఉండి ఒక్కరికీ కూడా మాఫీ రాలేదు? వంటి సందేహాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అధికారులు మాత్రం అన్ని ప్రశ్నలకు సమాధానాలు ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తున్నామంటున్నారు.

ఆధార్ కార్డుతో రుణమాఫీ సందేహాలకు చెక్

వ్యవసాయ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఏఈఓలు ప్రభుత్వం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు అనుసంధానంతో రూపొందించిన ప్రేత్యక వెబ్‌సైట్‌లో రైతురుణమాఫీ వివరాలను రైతులకు కలిగిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మండలంలోని 8 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండి సందేహాలకు సమాధానాలు అందిస్తున్నారు.

మాఫీ వర్తించకపోవడానికి గల కారణాలు

- మొదటి విడత మాఫీ లిస్టులో పేరు లేకపోవడం, లేదా మాఫీ వర్తించక పోవడానికి ఒక్కో రైతుకు ఒక్కో కారణం ఉన్నట్లు తెలుస్తుంది.
- కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డుకు పట్టాపాస్ పుస్తకానికి లింక్ కాకపోయి ఉండటం.
- ఆధార్‌లో పట్టాపాస్‌పుస్తకంలో లేదా రుణ ఖాతాలో పేరు, ఇంటిపేరు ఒకే విధంగా ఉండకపోవడం.
- కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి లక్ష లోపు రుణం కలిగి ఉండి రూ. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉండటం,
- కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉన్నదని పెండింగ్‌లో ఉండటం
- భూమి అమ్ముకున్న రైతులు, బ్యాంకులో రుణం తీర్చకపోవడంతో పట్టాదారు పాస్‌బుక్ ధరణిలో సదరు రైతుపేరున అందుబాటులో లేదని కారణం చూపిస్తుంది.
- రేషన్ కార్డులు ఆధార్ లింక్ లేకపోవడంతో వైబ్‌సైట్‌లోమాఫీ వివరాలు తెలియడం లేదు.

నాకు మాఫీ అవుతుందో లేదో..



నాకు నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. గత పదేళ్లుగా బ్యాంకులో రూ. లక్షా 70వేల అప్పు తీసుకున్నాను. రెగ్యులర్‌గా రెన్యూవల్ చేస్తున్నాను. గత ప్రభుత్వంలోను మాఫీ రాలేదు. రేషన్‌కార్డులో నా పేరున మాత్రమే అప్పు ఉంది. రెండో విడతలో మాఫీ అవుతుందని అధికారులు అంటున్నారు. ఈ సారైనా నాకు మాఫీ అవుతుందో లేదు తెలియడం లేదు.

- బోద వెంకటప్ప, రైతు దామరగిద్ద

నిబంధనల ఆధారంగా రుణమాఫీ



రైతుల పంట రుణమాఫీకి ప్రభుత్వం విధించిన నిబంధన ఆధారంగా రైతుల రుణమాఫీ కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా మొదటి లిస్టులో 28684 మంది రైతుల పంటరుణ మాఫీకి రూ. 165.45 కోట్ల నిధులు విడుదల చేసింది. రైతులకు ఎలాంటి సందేహాలున్న స్థానిక రైతువేదికలో రైతు ఆధార్ కార్డుతో వెళ్లి ఏఈఓలను సంప్రదిస్తే రుణమాఫీ స్టేటస్ తెలుసుకోవచ్చు.

- జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి, పేట

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పనిచేస్తూ అకాల మరణం చెందిన ఎం.లక్ష్మారెడ్డి కుటుంబానికి రూ.లక్ష బీమా చెక్కును ఆ సంఘం నాయకులు అందజేశారు. స్థానిక అంజనాగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన సంస్మరణ సభకు హాజరైన వక్తలు మాట్లాడుతూ.. ఆయన మృతి ఉపాధ్యాయులకు సంఘానికి తీరనిలోటని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆత్మస్థైర్యం ప్రసాదించాలని కోరారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూజలు చేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహ, ఇతర నాయకులు వెంకట్‌రెడ్డి, తిరుపతి, వెంకటేష్‌శెట్టి, లక్ష్మీనారాయణ, భాస్కర్, సత్యనారాయణరెడ్డి, జనార్ధన్, అనిల్ పాల్గొన్నారు.

అరకొర వసతులు.. తప్పని తిప్పలు..

- జీఓ 317 బాధితుల కష్టాలు వర్ణణాతీతం
- బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన



ఆదర్శ బీఈడీ కళాశాలలో కిక్కిరిసిన ఉపాధ్యాయులు..

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 317 బాధితులకు సొంత జిల్లాలకు పంపించేందుకు అడుగులు వేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు విద్యాశాఖలో అందుకు సంబందించిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను వెంటనే పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆగమేఘాలపై రాత్రికి రాత్రి వాట్సఫ్‌ల ద్వారా మెసెజ్‌లు పాస్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉదయం నుంచి స్థానిక ఆదర్శ బీఈడీ కళాశాలలో వెరిఫికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాలకు చెందిన వారు నారాయణపేట జిల్లాలో పనిచేస్తుంటే వారు తమ ఆధారాలను తీసుకుని వచ్చి అప్పీలు చేసుకోవాలని సూచించడంతో పెద్ద ఎత్తున టీచర్లు తరలివచ్చారు. దీంతో కళాశాల ప్రాంగణం జాతరను తలపించింది. పీఆర్‌టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాలు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి వారికి అవసరమైన సాయం చేయ డంతో పాటు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసింది.

సౌకర్యాల కల్పనలో విఫలం.. తోపులాట..

జిల్లాలో ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకున్న 318మందిని వెరిఫికేషన్ కోసం రమ్మని పిలవగా మరో 300మందికి పైగా ఇతర జిల్లాల బాధితులు సైతం ఆప్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చారు. దీంతో ఆదర్శ కళాశాల కిక్కిరిసిపోయింది. విద్యాశాఖ కనీసం వారికి నీడ కోసం టెంట్లు, తాగడానికి నీరు, కూర్చోడానికి కుర్చీలు సైతం ఏర్పాటు చేయలేదు. దీనికితోడు అభ్యర్థుల సంఖ్యకు తగినట్లు కౌంటర్ల ఏర్పాటు లేకపోవడంతో టీచర్ల మధ్య తోపులాట జరిగింది. ఎటు పోవాలో అర్థంకాక తికమక పడ్డారు. గర్భిణీలు, బాలింతలు, వికలాంగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పరిశీలించిన అంశాలు ఇవే..

ఇతర జిల్లాలకు చెందిన వారిగా వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు గుర్తింపు పత్రాలైన భార్యాభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే స్పౌజ్ సర్టిఫికేట్‌ను పరిశీలించారు. అలాగే, అనారోగ్య సమస్యలకు సంబందించి ఉంటే మెడికల్ సర్టిఫికేట్, రెండు జిల్లాలకు చెందిన వారు ఇరువురు తారుమారు కావాలంటే మ్యూచివల్ అండర్‌స్టాండింగ్ సర్టిఫికేట్, నేటివిటి, లోకల్ తదితర అంశాలతో పాటు వారు చదువుకున్న విద్యార్హతకు సంబందించి బోన ఫైడ్లు, జాయినింగ్ రిపోర్టు, సర్వీసుబుక్‌లను సరి చూశారు. దీనికి గాను సెక్టోరియల్ అధికారుల ఆద్వర్యంలో మూడు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఒక్కో కమిటీలో ముగ్గురు చొప్పున జీహెచ్‌ఎంలను సభ్యులుగా ఉంచి వర్జినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు.

గురువలింగంపల్లిలో టీఎల్‌ఎం మేళా



మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి ప్రభుత్వ స్కూల్‌లో మంగళవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేపథ్యంలో శిక్షసప్తహ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం బలరాం పాఠశాల ఆవరణలో వాటిని ప్రదర్శించి విద్యార్థులకు బోధించారు. ఆయన మాట్లాడుతూ.. టీఎల్‌ఎం ద్వారా విద్యార్థులకు విషయాలను అర్థమయ్యే విధంగా బోధించడానికి ఉపయోగపడుతుందని, విద్యార్థులు ప్రతిరోజు వీటిపై అధ్యాయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులతల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మరికల్: వర్షాకాలంలో వ్యాపించే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రత్యేక అధికారి శ్రీశైలం అన్నారు. మంగళవారం అప్పంపల్లిలో నిలిచిన వర్షపునీటి గుంతలను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామంలో పెరుకుపోయిన చెత్తను సిబ్బందితో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



అవార్డులు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

నారాయణపేట రూరల్ : ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తేనే సంస్థ మనుగడ సాధ్యపడుతుందని, లక్షే లక్ష్యం విజయవంతమవుతుందని ఆర్టీఓ మెఘాగాంధీ అన్నారు. ప్రగతిచక్రం అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సంస్థ ప్రారంభించిన లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే తప్పకుండా ఆర్టీసీ లాభాల బాటలో ఉంటుందన్నారు. మహాలక్ష్మి స్కీంతో బాగా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, అందుకు తగ్గట్లు బస్సులు నడిపిస్తూ సేవలు విస్తరించడం అభినందనీయమన్నారు. జూన్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులకు నిర్వహించిన ఆటాపోటీల విజేతలకు బహుమతులు అందించారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రగతిచక్రం అవార్డులతోపాటు ఏప్రిల్, మే నెలలో అత్యధిక ఈపీకే, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్, కండక్టర్లకు అందజేశారు. కార్యక్రమంలో డీఎం లక్ష్మిసుధ, సీఐ అలివేలమ్మ, ఎంఎఫ్ చంద్రనాయక్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సరోజ, సూపర్‌వైజర్లు భీమమ్మ, శ్రీశైలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ శశిధర్

కోస్గి: మున్సిపల్ పరిధిలో ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలను సైతం వీధి కుక్కలపై అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీలో ప్రత్యేక సభలు ఏర్పాటుచేసి వీధి కుక్కల నుంచి తప్పించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పట్టణంలో వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలను సైతం అప్రమత్తం చేయడం ద్వారా ప్రమాదాల నుంచి కాపాడవచ్చునన్నారు. కుక్కల దాడి నుంచి తప్పించుకునే విధానంపై ప్రత్యేకంగా ముద్రించిన గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



వాహనదారులతో మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ బాలరాజు

నారాయణపేట రూరల్: ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. స్థానిక వీరసవార్కర్ చౌరస్తాలో వాహనదారులకు మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. నంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నంబర్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది నరేష్, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు



కోస్గిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు



ముడుమాల్‌లో..

కోస్గి: వ్యవసాయ రంగంలో రైతులు నేటికి మూస పద్ధతులు అవలంభించి నష్ట పోతుంటారని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధునాతన పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చంద్రవంచ రైతువేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు వివరించారు. ముఖ్యంగా అధిక వర్షాల నేపథ్యంలో పత్తి, వరి పంటల్లో చీడ, పీడల నివారణ, తెగుళ్ల నుంచి రక్షణ గురించి సమగ్రంగా వివరించారు. ఏఈఓ అజయ్, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

కృష్ణా: పత్తిపంట సాగు, చీడపీడల నివారణపై మంగళవారం రైతులకు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ముడుమాల్ రైతు వేదికలో రైతునేస్తం ద్వారా దృష్యమాద్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. ఏఈఓ మానస మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తిపంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తల ఇచ్చే సలహాలు, సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. మంగళవారం మండలంలోని గోకుల్‌నగర్ గ్రామంలో స్థానిక ఎంపీఓ రామన్నతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలించి, చిన్నారులకు, గర్భిణులకు, నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాల ని సూచించారు. అక్కడి నుంచి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీఓ సిద్ధేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ల, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

దామరగిద్ద: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు ఎస్సీ, మాదిగ, మాలలకు రిజర్వేస్ కల్పించాలని కోరుతూ మండలంలోని కాన్‌కుర్తి గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేకు.. అశోక్, మహేష్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ గౌస్, లాలప్ప, నర్సింహులు మొగులప్ప, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

కొత్తకోట: మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన పల్లెపాగ ప్రశాంతను ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు శాలువాలతో సత్కరించారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉండటంతో పార్టీ గుర్తించి సముచిత గౌరవం కల్పించిందన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతకు బోనాలు



ధన్వాడలో బోనంతో వస్తున్న మహిళలు



మరికల్‌లో ఆకట్టుకున్న అమ్మవారి అవతారాలు

నర్వ: పోలేరమ్మ బోనాల పండగను మండలంలోని యాంకి, నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు.. మంగళవారం ఉదయం గొల్ల, కుర్వకులస్తు ఇష్టదైవమైన పోలేరమ్మకు అంబలిపోసి ఈ అంబలిని తమగొర్రెలు, పొటేళ్లపై చల్లుకున్నారు. సాయంత్రం పోలేరమ్మకు మహిళా భక్తులు బోనంతో ఊరేగింపుగా వెళ్లి అలయం చుట్టూ ప్రదక్షణలుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ మేరకు.. భక్తులు కోళ్లు, మేకలు, పోటేళ్ల బలిఇచ్చారు. గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని మంగళవారం గ్రామస్తులు పోచమ్మ బోనాల ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు.. కళాకారులు అమ్మవారి బోనాలతో, పోతురాజుల విన్యాసాల డప్పుల మధ్యన ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. మహిళలందరూ ఒకేసారి బోనాలతో రావడంతో పోచమ్మ బోనాల వేడుకలు కనుల పండవగా కొనసాగింది. అంతకుముందు గజ్జలమ్మ, కట్ట మైసమ్మలకు వారు బోనాలు సమర్పించారు. బోంత జయమ్మ, వెంకట్, సతీష్, కృష్ణ, రఘు, నాయకులు కృష్ణయ్య, నారాయణ, రామస్వామి, బసంత్, జగదీష్, రాములు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం బోనాలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. కుర్వకులస్తుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో కర్రెమ్మ ఆలయం వద్ద మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసిమొక్కులు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కంచుకోటలోని మద్దెలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఈ మేరకు.. పద్మశాలీ సాయంత్రం భక్తులు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శక్తిపీఠంలో గోరింటాకు పండగ

నారాయణపేట: పేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠంలో మంగళవారం సాయంత్రం స్వామి శాంతానంద సభా మండపంలో మహిళలు గోరింటాకు పండగ ఘనంగా నిర్వహించారు. ఈ పండుగకు శక్తి పీఠం మహిళా కమిటీ అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొని శక్తి పీఠం అధిష్ఠాన దేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి మహా మంగళహారతి సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.